క్లుప్తంగా

సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా సోము

శాంతిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్, ఐదుగురు కో కన్వీనర్లను నియమిస్తూ పార్టీ శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. కన్వీనర్‌గా కొలమడుగు గ్రామానికి చెందిన డి.సోమశేఖర్(సోము), కో కన్వీనర్లుగా ధరణేష్(గుంజార్లపల్లి), కె.వి.ఆనంద్‌కుమార్(కర్లగట్ట), చాంద్‌బాషా(రాళ్లబూదుగూరు), గంగాధర్(డొంకుమాకనపల్లి), ఫరూక్ ఫయాజ్(రాళ్లబూదుగూరు) నియమితులయ్యారు. పదవులు పొందిన వారిని ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ శ్రీనివాసులు, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి అభినందించారు.

పక్కా ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్లు

బైరెడ్డిపల్లె: జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు అందిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హేమచంద్రుడు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం పేదలకు నిర్మిస్తున్న గృహాలకు మీటర్లు, సర్వీస్‌వైరు, ఎంసీబీలు అందుబాటులో ఉన్నాయన్నారు. లబ్ధిదారులు ఒక ఫొటో, పట్టా, వర్క్ ఆర్డర్ కాపీ జిరాక్స్‌లు ట్రాన్స్‌కో కార్యాలయంలో గానీ, లైన్‌మెన్ వద్ద గానీ అందజేయాలన్నారు. లబ్ధిదారులకు వెంటనే ఉచిత విద్యుత్ సామగ్రితో పాటు ట్రాన్స్‌కో సిబ్బంది మీటర్లను అమర్చుతారని తెలిపారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు

పెద్దపంజాణి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీ నాయకులతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టీ.శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. 13వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎస్‌హెచ్‌ఓ పాల్గొని ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

నేడు లయన్స్‌క్లబ్ వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యులచే శిబిరం నిర్వహిస్తామన్నారు. కంటి జబ్బులు కలిగిన వారికి పరీక్షలు చేసి ఉచితంగా ఆపరేషన్లు, కంటి అద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.


ఘనంగా సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం



సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పలమనేరు: పట్టణ సమీపంలోని రొంటకుంట్ల రోడ్డులో వెలసిన రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అర్చకులు వెంకటేష్, నిర్వాహకులు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాళ్‌కు నివాళి



పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

పలమనేరు: పట్టణ సమీపంలోని బీజేపీ కార్యాలయంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఏకాత్మమానవతా వాదంతో సమగ్ర భారతావనిని తీర్చిదిద్దేందుకు తన జీవితాన్ని త్యాగం చేసిన ఆధునిక మహర్షి పండిట్ దీనదయాళ్ అని నాయకులు కొనియాడారు. ఇందులో తాతయ్య, ప్రసాద్, రమణ, వెంకటాద్రి, దేవేంద్ర, వేణుగోపాల్ రెడ్డి, ఉపేంద్ర పాల్గొన్నారు.

అజరామరుడు ఘంటసాల

తిరుపతి కల్చరల్ : గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అజరామరుడని తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా తిరుపతి ఫిలిం సొసైటీ సభ్యులు స్థానిక ఘంటశాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత శ్రీవారి గీతాలను ఆలపించిన ఘనత ఘంటసాలకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా స్థానిక గాయకులు సోము ఉమాపతిని సన్మానించారు.

రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం

- లోక్‌అదాలత్‌కు భారీ స్పందన



లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు వాసుదేవరావు, కార్తీక్, సింధు

పుంగనూరు: స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు 481 పరిష్కరించి దీని ద్వారా రూ.54.07 లక్షలు చెల్లించినట్లు సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు తెలిపారు. శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి సింధుతో కలసి లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ కేసులు 53, క్రిమినల్ కేసులు 153, ఇతర బ్యాంకు కేసులు 275 కేసులు పరిష్కరించినట్లు న్యాయమూర్తి వాసుదేవరావు తెలిపారు. కేసులను సత్వరం పరిష్కరించుకునేందుకు రాజీమార్గం ఎంతో మేలన్నారు. దీని ద్వారా సమస్యలు పరిష్కారమై ఇరువర్గాలు శాంతియుత వాతావరణంలో జీవించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడ మధ్యవర్తిత్వం చేసి, కేసులు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు విజయకుమార్, న్యాయవాదులు బాలాజీకుమార్, చెన్నకేశవులు, వెంకటముని యాదవ్, ఆనందకుమార్, సురేష్, వినోద్‌కుమార్, వెంకట్రమణతో పాటు ఎస్‌ఐ కుల్లాయప్ప తదితర అధికారులు, కక్షిదారులు హాజరయ్యారు.

పులిచెర్ల(కల్లూరు)లో..

పులిచెర్ల(కల్లూరు): పాకాల లోక్‌అదాలత్ కోర్టులో శనివారం 12 కేసులు పరిష్కారమైనట్లు కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, పలు కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించినట్లు చెప్పారు.



లోక్ అదాలత్‌కు వచ్చిన కక్షిదారులు

పలమనేరులో..

పలమనేరు: జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి, పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో రూ.82.84 లక్షలు విలువజేసే పలు కేసులు రాజీ అయ్యాయి. ఇందులో క్రిమినల్ కేసులు 36, సివిల్ కేసులు 18, చెక్‌బౌన్స్ కేసులు 12, హెచ్‌ఎంఓపీ, ఎంసీ,డీవైసీ తదితర కేసులు 13 రాజీ అయినట్లు వారు తెలిపారు. దీంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన 11,680 కేసులు సైతం పరిష్కారమైనట్లు చెప్పారు. నియోజకవర్గంలోని పోలీసులు, సెబ్ అధికారులు, పలువురు బ్యాంకర్లు, ఇతర శాఖల అధికారులు, న్యాయవాదులు, లోక్‌అదాలత్ సభ్యులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కుప్పంలో 471 కేసులు పరిష్కారం

కుప్పంరూరల్: కుప్పం జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 471 కేసులు పరిష్కారం జరిగినట్లు జూనియర్ సివిల్‌జడ్జి పల్లవి తెలిపారు. 17 సివిల్, 454 క్రిమినల్ కేసులు పరిష్కరించినట్లు ఆమె చెప్పారు. వివిధ కేసుల్లో నిందితుల నుంచి రూ.10.45 లక్షలు జరిమానా రుసుములు వసూలు చేసినట్లు జడ్జి పల్లవి తెలిపారు. వివిధ కారణాలతో కేసుల్లో ఉన్న కక్షిదారులకు లోక్ అదాలత్ వరం లాంటిదని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: రాష్ట్రాభి వృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలు లాంటివని గ్రామస్థాయి నుంచి అభివృద్ధి పురోగతి చెందాలని గ్రామీణ రోడ్లకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన మండలంలోని ఏడుచుట్లకోట నుంచి చింతమాకులపల్లి మీదుగా బీసీపల్లి వరకు జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటికి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వి.కోట మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరిగాయని, రోడ్లు అవసరమయ్యే గ్రామాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, ఇంజినీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

సోమల : క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. శనివారం పార్టీ మండల అధ్యక్షుడు గంగాధరం ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు నూతనంగా నియమించిన పార్టీ గృహ సారథులతో కలిసి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కుటుంబానికి రూ.1 లక్ష నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్న విషయాన్ని వారికి తెలపాలని సూచించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, పీవీ మిథున్ రెడ్డికి మండలం నుంచి అధిక మెజారిటీ వచ్చేలా చేయడంతో పాటు వారిని గెలిపించి సీఎంగా మళ్లీ జగనన్నను చేసుకునేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అలాగే చంద్రబాబు ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడాను ప్రజలకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి పీఏ మురళీకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, జేసీఎస్ మండల కన్వీనర్ మంజునాథ, పార్టీ జిల్లా కార్యదర్శి శీలం భాస్కర్, నేతలు వీవీ రమణ, సాంబయ్య, శ్రీనివాసులు, సరస్వతమ్మ, రమణ పాల్గొన్నారు.

బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలి



బీసీఫ్రంట్ సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

పలమనేరు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలో బీసీలకు అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్థానిక బీసీ ఫ్రంట్ నాయకులు గోవిందస్వామి తెలిపారు. వారి సంఘ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన సంఘ సభ్యులతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీసీలకు భద్రత, సామాజిక రక్షణ కావాలంటే ఈ చట్టం అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే ఇలాంటి చట్టాలను చేయాల్సిన కేంద్రం ఇప్పటికైనా దీని గుర్తించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన వినతిపత్రాన్ని సైతం ప్రధానికి నరేంద్రమోదీకి పోస్టు ద్వారా పంపినట్టు ఆయన చెప్పారు. సమావేశంలో సంఘ నేతలు నంజుడప్ప, ఆనంద్, లక్ష్మీపతి, రామ్మూర్తి, చిన్నబ్బ, నాగరాజగౌండర్ తదితరులు పాల్గొన్నారు.

బాట గంగమ్మకు ప్రత్యేక పూజలు



బాట గంగమ్మకు పండ్ల అలంకరణ

బైరెడ్డిపల్లె: బాటగంగమ్మ ఆలయ మండపం పూజల్లో భాగంగా శనివారం వివిధ రకాల పండ్ల అలంకరణలో అమ్మవారి అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామదేవతకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు తొలగించండి

రామకుప్పం: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో మండల పరిధిలో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లను ఆయా రాజకీయ పార్టీల వారు తొలగించాల్సిందేనని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. అదేవిధంగా గోడలపై రాతలు, పార్టీలకు సంబంధించిన తోరణాలను ఆయా పార్టీలవారే తొలగించుకోవాలన్నారు. ఒకరోజులో తొలగించకపోతే మరుసటిరోజు ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల వారు సహకరించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కోరారు.

మానవ హక్కులపై అవగాహన

గంగవరం: ప్రతి గ్రామంలో మానవ హక్కులపై అవగాహన కల్పిస్తామని మానవహక్కుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మునిరత్నం, వేలాయుధం తెలిపారు. శనివారం వారు మండలంలోని చిన్నమనాయనిపల్లి గ్రామం దళితవాడ ప్రజలతో సమావేశమయ్యారు. వారికి మానవ హక్కులపై అవగాహన కల్పించారు. నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు



సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శాంతిపురం: సబ్‌స్టేషన్‌లో ఫ్యూజు వేసేందుకు వెళ్లిన యువకుడు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. రాళ్లబూదుగూరు పంచాయతీలోని గొల్లపల్లికి చెందిన బాధిత యువకుడి తల్లి మునెమ్మ ఫిర్యాదు, రాళ్లబూదుగూరు పోలీసుల కథనం మేరకు వివరాలు.. గొల్లపల్లికి చెందిన ఆర్.మురుగేష్(23) సొంత పని కోసం శనివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై రాళ్లబూదుగూరుకు బయలుదేరాడు. మార్గమధ్యలోని సబ్‌స్టేషన్ వద్దకు రాగానే అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ ఉపేంద్ర తనను ఆపి ఫ్యూజు వేయడానికి సాయం చేయాలని కోరారు. ఫ్యూజు వేసేందుకు వెళ్లిన మురుగేష్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని 108 ద్వారా స్థానికులు కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న మురుగేష్ ఆరోగ్యం విషమంగా ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దీనిపై రాళ్లబూదుగూరు ఎస్‌ఐ మునస్వామి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఆపరేటర్ నిర్లక్ష్యం కారణంగా తమ వాడు ప్రాణాలు మీదకు వచ్చిందన్న సమాచారంతో గొల్లపల్లి గ్రామస్తులు, బాధితుడి బంధువులు సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు, స్థానిక నాయకులు జోక్యం చేసుకుని వారి ఆందోళన విరమింపజేశారు.



గాయపడిన మురుగేష్

ముమ్మరంగా పుష్పపల్లకి సేవకు ఏర్పాట్లు



విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన స్వామివారి ప్రతిరూపాలు

వి.కోట: పట్టణంలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామికి ఆదివారం నిర్వహించే పుష్పపల్లకి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏటా పట్టణంలో వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల అనంతరం ఆనవాయితీగా శ్రీవీరాంజనేయస్వామికి పుష్పపల్లకి నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పట్టణమంతా విద్యుత్ లైట్లు, స్వామివారి ప్రతిరూపాలు, పుష్పాలంకరణతో ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఈ పల్లకి సేవకు చుట్టుపక్కల వాసులే కాక ఇరుగు పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొంటారు. 13వ తేదీ సోమవారం రాత్రి శ్రీ వీరాంజనేయస్వామిని పుష్పపల్లకిపై కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగిస్తారు. పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు ప్రారంభిస్తారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మకర్త తెలిపారు.

పలమనేరు సోషల్ మీడియా కన్వీనర్ల ఎంపిక

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని ఐదు మండలాలు, మున్సిపాలిటీకి సంబంధించి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, కోకన్వీనర్ల జాబితాను వైఎస్సార్‌సీపీ శనివారం ప్రకటించింది. ఇందులో భాగంగా పలమనేరు మున్సిపాలిటీకి సంబంధించి కన్వీనర్‌గా ప్రసాద్ రెడ్డి, కోకన్వీనర్లుగా షబీర్, ఉస్మాన్, శంకర్‌ఆచార్య, రంజిత్‌కుమార్ పలమనేరు మండల కన్వీనర్‌గా వైఎం వెంకటేష్, కోకన్వీనర్లుగా మునస్వామి, శ్రీనివాసులు, మహేష్‌చౌదరి, విబూధి ప్రసాద్ నియమితులయ్యారు. బైరెడ్డిపల్లి మండల కన్వీనర్‌గా జనార్దన్, కోకన్వీనర్లుగా రెడ్డిప్రసాద్, వినోద్‌కుమార్, పురుషోత్తం, పీరూసాహేబ్, అలాగే వీకోట మండల కన్వీనర్‌గా శివకుమార్, కోకన్వీనర్లుగా హరీష్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాసులు రెడ్డి, తౌఫిక్‌ను ఎన్నుకున్నారు. గంగవరం మండల కన్వీనర్‌గా ఈశ్వర్, కోకన్వీనర్లుగా దేవరాజుగౌడ్, శ్రీనివాస్, గణేష్, జీవన్‌కుమార్‌రెడ్డి, రంజింత్ యాదవ్, పెద్దపంజాణి మండల కన్వీనర్‌గా బాలాజీ, కోన్వీనర్లుగా రెడ్డెప్ప, నరేష్, అహ్మద్‌బాష, మహేష్, భరత్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు.

కాశీవిశ్వేశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వర స్వామి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేటలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నిధులతో నూతనంగా నిర్మించిన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మించి ఏడాది అయిన సందర్భంగా శనివారం ఉదయం ఆలయంలో అర్చకులు హోమాలు చేపట్టారు. అనంతరం స్వామివారికి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, గోవిందరెడ్డి, దేవేంద్రరెడ్డి, విక్రం తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన కొల్లను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్: శివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 19వ తేదీన జరిగే శ్మశానకొల్ల(మయానసేవ)ను విజయవంతం చేయాలని అంకాళపరమేశ్వరి ఆలయాభివృద్ధి ట్రస్టు నిర్వాహకులు కుమార్ పిలుపునిచ్చారు. చిత్తూరు, గురప్పనాయుడు వీధిలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో శనివారం ఆ నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఆలయంలో శివరాత్రి మహోత్సవం అత్యంత వైభవంగా జరపనున్నట్లు తెలిపారు. ఈనెల 19వ తేదీన శ్మశానకొల్లను ఘనంగా నిర్వహిస్తామన్నారు. భూతవాహనంపై అమ్మవారు ఊరేగుతూ నీవానదికి చేరుకుంటారన్నారు. అక్కడ అమ్మవారికి విశేష పూజలు చేస్తామని చెప్పారు. అనంతరం నగర వీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. మయాన సేవ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. తదనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అర్చకులు కుమార్, మయానసేవ ఉత్సవ కమిటీ సభ్యులు సురేష్, వినోద్, అరుల్ కుమార్, ముత్తు, వేలాయుధం, పెరుమాళ్, వేలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ



విశేషాలంకరణలో ఏకాంబరేశ్వర స్వామి

యాదమరి: మండల కేంద్రంలోని త్రివేణి సంఘమంలో ఉన్న కామాక్షంబదేవి సమేత ఏకాంబరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. వేకువజామున ఆలయంలో స్వస్తివాచనం, గణపతి పూజ చేశారు. రాత్రి ఏడు గంటలకు వాస్తుపూజ, అంకురార్పణ నిర్వహించారు. అనంతరం దేవ దేవరులను పురుషామృగ వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమాలకు యాదమరికి చెందిన అనసూయమ్మ, నారాయణ స్వామి, గుట్టకిందవూరుకు చెందిన పాండునాయుడు, కాశిరాళ్ల గొల్లపల్లెకు చెందిన ధనలక్ష్మి, బాలాజీ మందడి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

బాలిక పోలీసులకు అప్పగింత

చిత్తూరు అర్బన్: తప్పిపోయిన ఆరేళ్ల బాలికను స్థానికులు శనివారం చిత్తూరు టూటౌన్ సీఐ మల్లికార్జునకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన షరీఫ్ కుమార్తె సన(6) చిత్తూరు నగరంలో తప్పిపోయింది. విషయం తెలుసుకున్న 31వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్, పోలీసు సిబ్బంది అక్బర్, వలంటీర హరీష్ పాప ఆచూకీ కోసం నగరమంతా వెతిక్కారు. బాలికను గుర్తించిన అనంతరం ఎస్‌ఐ సమక్షంలో తండ్రికి చిన్నారిని అప్పగించారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న కాళభైరేశ్వర దేవస్థానం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తవణంపల్లెలోని కాళభైరేశ్వర దేవస్థానం ముస్తాబవుతోంది. ఈ నెల 16 నుంచి 22వ తేదీ బుధవారం వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులు వేసి, ముస్తాబు చేశారు.

- తవణంపల్లె



కాళభైరేశ్వర ఆలయం